RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in
దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 24 సోమవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 201 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష
NALGONDA | MONDAY AUGUST 24 2026 | VOL:16 | ISSUE: 201 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రచారం చేయండి

## లండన్‌లో తెలుగు ప్రవాసులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

**హైదరాబాద్/లండన్, ఆగస్టు 23**

తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయాలని లండన్‌లోని తెలుగు ప్రవాసులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆదివారం లండన్‌లోని తెలుగు ప్రవాసులతో సమావేశ మయ్యారు. తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్ ప్రగతిపై ఈ సందర్భంగా వారితో చర్చించారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రవాసులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రచారం చేస్తూ, రాష్ట్రానికి రాయబారులుగా నిలవాలని కోరారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు హాజరుకావాలని కోరారు. పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నా మన్నారు. రాష్ట్రంలో యువతకుఉ ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రవా సాంధ్రులు సహకారాన్ని అందించాలని కోరారు.

అన్ని విషయాలపై మాట్లాడుతా : సీఎం

కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆయనను అమెరికా వెళ్లకుండా అడ్డుకుందని, రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. దీనికి సంబంధించిన అన్ని విషయాలనూ ఆయన హైదరాబాద్ వచ్చాక

(మిగతా 2వ పేజీలో..)




## సరికొత్త సరిహద్దులను విస్తరిద్దాం..



### నేషనల్ స్పేస్ డే సందర్భంగా మోడీ ఇంట్రెస్టింగ్ ట్వీట్

న్యూఢిల్లీ : జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు, శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. మరింత పెద్ద కలలు కంటూ, మరెన్నో ఆవిష్కరణలు చేస్తూ, సరికొత్త సరిహద్దులను విస్తరిద్దాం అంటూ ట్వీట్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ సేవా తీర్థ్‌లో అంతరిక్ష రంగానికి చెందిన 20 స్టార్టప్‌ల సీఈవోలు, వ్యవస్థాపకులతో సమావేశ మయ్యారు. భారత్‌లో అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ అంతరిక్ష రంగం, కొత్త సాంకేతికతలు, ఆవిష్కరణలు, భవిష్యత్ అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి సంబంధించిన వీడియోను జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకుని తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్ వేగంగా పురోగమిస్తోందని, ముఖ్యంగా ప్రైవేట్ అంతరిక్ష సంస్థల భాగస్వామ్యం పెరగడంతో గ్లోబల్ ఇన్వెస్టర్లకు భారతదేశం ఒక పెట్టుబడుల కేంద్రంగా మారిందని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

## ఖర్గేతో కొండా సురేఖ భేటీ?

బెంగళూరు : రాష్ట్ర కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఆదివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఆమె బెంగళూరుకు వెళ్లినట్లు గాంధీభవన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నాలుగు రోజుల క్రితం కొండా సురేఖ కుమార్తె సుస్మిత.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఇందుకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు కొండా సురేఖ సమాధానం కూడా ఇవ్వడం

(మిగతా 2వ పేజీలో..)



## కొండా సురేఖ లేఖ కలకలం..

### 'నా కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారు'

### ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వ్యాఖ్యల వెనుక ఉన్నవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు

### తనపై 'సామూహిక దాడి' జరుగుతున్నా పార్టీ నాయకత్వం మౌనం వహిస్తోందని మంత్రి ఆవేదన

**హైదరాబాద్, ఆగస్టు 23 :**

అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ పార్టీ క్రమశిక్షణ కమిటీని ఆశ్రయించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తనపై జరుగుతున్న వ్యాఖ్యల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి, పార్టీ నిబంధనల ప్రకారం కఠిన



చర్యలు తీసుకోవాలని ఆమె టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి లేఖ రాసినట్లు సమాచారం. ఒక సీనియర్ బీసీ మహిళా నాయకురాలైన తనపై తీవ్ర పదజాలంతో సామూహికంగా దాడి జరుగుతున్నా.. పార్టీ నాయకత్వం మౌనం వహించడం ఆందోళన కలిగిస్తోందని సురేఖ తన లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. పార్టీ క్రమశిక్షణ, విలువలకు విరుద్ధంగా వ్యవహరించే నాయకులపై నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆమె కోరినట్లు సమాచారం.

ఎమ్మెల్యేల ప్రెస్‌మీట్ వెనుక ఎవరున్నారు?

ఇటీవల కొండా సురేఖకు వ్యతిరేకంగా

(మిగతా 2వ పేజీలో..)

## మల్లారెడ్డి యూనివర్సిటీలో ఉద్రిక్తత

### 'టాక్సిక్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో విద్యార్థులకు గాయాలు

**హైదరాబాద్, ఆగస్టు 23**

మల్లారెడ్డి యూనివర్సిటీలో ఉద్రిక్తత నెలకొంది. 'టాక్సిక్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో విద్యార్థులకు గాయాలు అయ్యాయి. ప్రముఖ నటులు యశ్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చిన విద్యార్థులు. ప్రధాన వేదిక

(మిగతా 2వ పేజీలో..)



## ఆటో కార్మిక సంఘాలతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు సఫలం

### ఆటో కార్మిక సంఘాల డిమాండ్స్ పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉంది

### ఆటో కార్మిక సంఘాల నిరవధిక బంద్ విరమించుకోవాలన్న ప్రభుత్వ విజ్ఞప్తి కి స్పందించి సమ్మె విరమించిన ఆటో కార్మిక సంఘాలకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్

### ఆటో కార్మిక సంఘాల కు ప్రభుత్వం నుండి సానుకూల అంశాలు

**హైదరాబాద్, ఆగస్టు 23**



ఆటో కార్మిక సంఘాలతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు సఫలం అయ్యాయి. చర్చలు సఫలం కావడంతో ఆటో క్యాబ్ యూనియన్ లతో చర్చలు సాఫీగా సాగాయి. దీంతో అర్ధరాత్రి నుంచి తలపెట్టిన సమ్మెను విరమిస్తున్నట్లు యూనియన్లు ప్రకటించాయి. ఆటో కార్మిక సంఘాల డిమాండ్స్ పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి తెలిపారు. ఆటో కార్మిక సంఘాల నిరవధిక బంద్ విరమించుకోవాలన్న ప్రభుత్వ విజ్ఞప్తి కి స్పందించి సమ్మె విరమించిన ఆటో కార్మిక సంఘాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ పక్షాన ఈవి ఆటో లు కొనే ప్రస్తక్తే

(మిగతా 2వ పేజీలో..)



## కష్టపడ్డ కార్యకర్తలకు పదవుల్లో ప్రాధాన్యత : టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాద్, ఆగస్టు 23 (ప్రజా మలుపు) :**

కష్టపడ్డ కార్యకర్తలకు పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు సుద ర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి,



(మిగతా 2వ పేజీలో..)

తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

# తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రచారం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతానని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించారు. అనుమతి నిరాకరణ నేపథ్యంలో ఆయనకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు, పార్టీ నాయకులకు, ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. షెడ్యూల్ ప్రకారం లండన్ లో తన సమావేశాలు ముగిశాయని వెల్లడించారు. మూడు రోజుల పర్యటనలో అద్భుతమైన మద్దతు లభించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. షెడ్యూల్ ప్రకారం లండన్ నుంచి బోస్టన్ వెళ్లాల్సి ఉందనీ, అయితే కేంద్రం నిరాకరించడంతో తిరిగి హైదరాబాద్ కు బయలుదేరుతున్నట్లు వివరించారు.

# మల్లారెడ్డి యూనివర్సిటీలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

సమీపంలో విద్యార్థుల మధ్య తోపులాట జరిగింది. తోపులాటలో పలువురు విద్యార్థులు సొమ్మసిల్లి పడిపోయినట్లు సమాచారం. విద్యార్థులపై సౌండ్ స్పీకర్లు పడటంతో కొందరికి గాయాలు అయ్యాయి. గాయపడిన విద్యార్థులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. వేదికకు దూరంగా జరగాలని విద్యార్థులకు మాజీ మంత్రి మల్లారెడ్డి, ప్రీతిరెడ్డిలు విజ్ఞప్తి చేసారు. భారీగా విద్యార్థులు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం.మల్లారెడ్డి యూనివర్సిటీ యాజమాన్యం 'టాక్సిక్' ప్రీ-రిలీజ్ ఈవెంట్ కోసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. మల్లారెడ్డి యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థులను భారీగా పిలిపించి ఎలాంటి భద్రత చర్యలు తీసుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఫ్లడ్ లైట్స్ స్టేజ్ కూలిపోవడంతో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. సినిమా యూనిట్ పై కూడా ఫిర్యాదు చెయడంతో పోలీసులు కేసులు నమోదు చేసినట్లు తెలిసింది.

# కష్టపడ్డ కార్యకర్తలకు పదవుల్లో ప్రాధాన్యత : టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

(మొదటి పేజీ తరువాయి)

డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కార్పొరేషన్ చైర్మన్లు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, సునీల్ కుమార్ రెడ్డి, విపుల్ గౌడ్,ఫ్రంటల్ ఆర్గనైజేషన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పదవుల్లో సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. క్రింది స్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తలకు కూడా పదవులు ఇవ్వాలని డిమాండ్ వస్తోందని, పదవుల భర్తీలో అన్ని వర్గాలకు సమతుల్యత పాటిస్తామని చెప్పారు. 70 శాతం పదవులను పాత కార్యకర్తలకే ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ ఇన్‌చార్జితో కలిసి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఏఐసీసీ స్థాయిలో అనుసరిస్తున్న విధానం కూడా ఇదే ఫార్మాట్‌లో ఉందన్నారు. గత ఐదేళ్లుగా పార్టీ కోసం నిరంతరం కష్టపడ్డ వారికి పదవుల్లో అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఎన్ఎస్ యుఐ, యూత్ కాంగ్రెస్‌తో పాటు పార్టీని అంటిపెట్టుకుని పనిచేస్తున్న కార్యకర్తలకు తొలి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. అన్ని కమిటీలను భర్తీ చేస్తామని, ఇందులో 20 శాతం కొత్త వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీలకు సంబంధించి అప్రూవల్ ఇవ్వాలని మంత్రి సీతక్క సూచించినట్లు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను తప్పకుండా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. "అధికారం కార్యకర్తల కృషి వల్లే వచ్చింది. కార్యకర్తల కష్టాన్ని కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ మరచిపోదు" అని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పీసీసీ అధ్యక్షుడిగా తన 35 ఏళ్ల ఇంజనీరింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాల కల సాకారం అయిందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లతో తిరిగి అధికారంలోకి వస్తుందని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# ఖర్గేతో కొండా సురేఖ భేటీ?

(మొదటి పేజీ తరువాయి)

తెలిసిందే. అయితే కొండా సురేఖే వెనక ఉండి తన కూతురితో మాట్లాడించారని, ఇందుకు మంత్రిపై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని పలువురు ఎమ్మెల్యేలు కోరుతున్నారు. ఆమెను మంత్రివర్గం నుంచి తప్పిస్తారన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ రాష్ట్ర నాయకుల అపాయింట్‌మెంట్ కోరినప్పటికీ వారు అందుబాటులోకి రాకపోవడంతో.. ఆమె బెంగళూరు వెళ్లి ఖర్గేను కలిశారని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ఆదివారం మధ్యాహ్నం సమయంలో సుమారు 15 నిమిషాలపాటు ఖర్గేతో ఆమె భేటీ అయినట్లు, తన కూతురు చేసిన వ్యాఖ్యల తర్వాత జరిగిన పరిణామాలను ఆయనకు వివరించినట్లు చెబుతున్నాయి. ఈ సందర్భంగా.. తాము కాంగ్రెస్ పార్టీని, గాంధీ కుటుంబాన్ని విమర్శించలేదని, కొందరు కావాలనే తమను టార్గెట్ చేశారని సురేఖ చెప్పినట్లు సమాచారం. ఖర్గే కూడా కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఆరా తీసినట్లు, పార్టీకి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడటం మంచిది కాదని అన్నట్లు గాంధీభవన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇవ్వాలని సురేఖకు చెప్పగా.. ఇప్పటికే రెండుసార్లు వివరణ ఇచ్చానని ఆమె తెలిపినట్లు సమాచారం. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొద్దిగంటల్లో లండన్ నుంచి హైదరాబాద్‌కు చేరుకోనుండగా.. కొండా సురేఖ ఏఐసీసీ అధ్యక్షుడితో భేటీ కావడం హాట్ టాపిక్‌గా మారింది.

# ఆటో కార్మిక సంఘాలతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు సఫలం

(మొదటి పేజీ తరువాయి)

లేదు ఆది దుష్ప్రచారం మాత్రమేనని మంత్రి తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించింది. విధివిధానాలకు సెప్టెంబర్ 1 వ తేదీ కార్మిక శాఖ, రవాణా శాఖ, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సంయుక్త సమావేశం. 2012 తర్వాత ఆటో చార్జీలు పెంచలేదు కాబట్టి ఆటో చార్జీలు పెంచడానికి అంగీకరిస్తూ ఎంత పెంచాలి అనే దానిపై తగిన నివేదిక తీసుకొని సంబంధిత జీవో విడుదల చేయడానికి అంగీకారం. ఓలా, ఉబెర్ లా మాదిరి ప్రభుత్వం తరుపున యాప్ చేయాలని నిర్ణయం. ప్రభుత్వం ఐటీ శాఖ నుండి యాప్ ప్రారంభించేందుకు తగిన ప్రక్రియ ప్రారంభిస్తాం. ద్విచక్ర వాహనాల్లో రాపిడో, ఓలా, ఉబెర్ నడిపే వాటికి ఎల్లో ప్లేట్ ఉన్న వాటికి మాత్రమే ప్రయాణికులను తరలింపు పై నిర్ణయం తీసుకుంటాం. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు 12 వేల రూపాయల అంశంపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తగిన అంశాలు పరిగణన లోకి తీసుకొని ముఖ్యమంత్రి ,ఉప ముఖ్యమంత్రి, సహచర మంత్రులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటాం. హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో పాత డీజిల్ , పెట్రోల్ ఆటో లకు రెట్రోఫిట్మెంట్ ద్వారా ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చడానికి 1.50 లక్షలు ప్రభుత్వం సహాయం అందిస్తుంది. కొత్త ఆటోలు కొనుగోలు చేయడానికి సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. హైదరాబాద్ లో కాలుష్యాన్ని తగ్గించడానికి పర్యావరణాన్ని కాపాడడానికి నగరంలో ఈవి ఆటోలుగా మార్చడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆటో కార్మికుల సోదరులు వారి డిమాండ్స్ పట్ల ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉంది. ఆటో కార్మిక సంఘాలతో చర్చలు జరిపిన వారిలో రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి , అడిషనల్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్ , జెటిసి లు చంద్రశేఖర్ గౌడ్ ,శివ లింగయ్య , వెంకట రమణలు ఉన్నారు.

# కొండా సురేఖ లేఖ కలకలం..

(మొదటి పేజీ తరువాయి)

కొందరు ఎమ్మెల్యేలు మీడియా సమావేశం నిర్వహించడం ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది. తనపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో బహిరంగంగా విమర్శలు చేయిస్తున్న వారి వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించాలని మంత్రి కోరినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంపైనా పరోక్ష విమర్శలకు దారితీస్తోంది. తనకు వ్యతిరేకంగా ఎమ్మెల్యేలతో ప్రెస్‌మీట్ పెట్టించిన వారి వెనుక ఉన్న వ్యక్తులపై పార్టీ నాయకత్వం చర్యలు తీసుకోవాలని ఆమె లేఖలో కోరినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**'బీసీ మహిళా నాయకురాలిపై ఇంతటి దాడా?'**

తాను సీనియర్ బీసీ మహిళా నాయకురాలిగా ఉన్నప్పటికీ తనపై వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యులపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదని సురేఖ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. రాజకీయ విమర్శలు ఉంటే వాటిని పార్టీ వేదికలపై చర్చించుకోవాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని ఆమె పేర్కొన్నట్లు సమాచారం.తనపై జరుగుతున్న పరిణామాలపై పార్టీ నాయకత్వం స్పందించి వాస్తవాలను పరిశీలించాలని, బాధ్యులెవరైనా పార్టీ క్రమశిక్షణకు లోబడి చర్యలు ఎదుర్కోవాలని ఆమె కోరినట్లు తెలుస్తోంది.

**పార్టీ క్రమశిక్షణపై ప్రశ్నలు**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పార్టీలో అంతర్గత విభేదాలు పలుమార్లు బహిర్గతమయ్యాయి. తాజాగా కొండా సురేఖ లేఖతో మరోసారి ఆ విభేదాలు తెరపైకి వచ్చాయి. మంత్రిపై ఎమ్మెల్యేలు బహిరంగంగా విమర్శలు చేయడం, దానికి ప్రతిగా ఆమె పార్టీ క్రమశిక్షణ కమిటీని ఆశ్రయించడం కాంగ్రెస్‌లో పరిస్థితి ఎంతవరకు వెళ్లిందన్న చర్చకు దారితీస్తోంది. "పార్టీ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అన్న సురేఖ డిమాండ్ ఇప్పుడు పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది.

**అధిష్ఠానం ఎలా స్పందిస్తుంది?**

మంత్రి కొండా సురేఖ చేసిన ఫిర్యాదుపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. లేఖలో పేర్కొన్న అంశాలపై విచారణ చేపట్టి బాధ్యులను గుర్తిస్తారా? లేక వివాదాన్ని అంతర్గతంగా పరిష్కరించే ప్రయత్నం చేస్తారా? అన్నది చూడాల్సి ఉంది.ఇదిలా ఉండగా, కొండా సురేఖ లేఖను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంపై పరోక్ష అసంతృప్తి వ్యక్తీకరణగా రాజకీయ ప్రత్యర్థులు అభివర్ణిస్తున్నారు. అయితే రేవంత్‌రెడ్డి స్వయంగా ఈ వ్యవహారంపై స్పందించారా లేదా అనే దానిపై అధికారిక స్పష్టత అవసరం. మొత్తంగా..మంత్రి కొండా సురేఖ ఫిర్యాదుతో కాంగ్రెస్‌లో అంతర్గత రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. ఎమ్మెల్యేల ప్రెస్‌మీట్ వెనుక ఉన్నవారెవరు? పార్టీ నాయకత్వం వారిపై చర్యలు తీసుకుంటుందా? సురేఖ ఫిర్యాదుపై అధిష్ఠానం ఎలా స్పందిస్తుంది? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి.

# ఓటర్ల జాబితా సవరణ.. అన్‌మ్యాప్డ్ ఓటర్లకు నోటీసులు జారీ

**హైదరాబాద్, ఆగస్ట్ 23**

2026 ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణలో భాగంగా, రాష్ట్రంలోని 32.36 లక్షల అన్‌మ్యాప్డ్ ఓటర్లతో పాటు, డేటాలో వ్యత్యాసాలున్న ఓటర్లకు ఈఆర్వోలు అక్టోబర్ 15లోగా దశలవారీగా నోటీసులు జారీ చేస్తున్నారు. తమ పేరిట నోటీసు జనరేట్ అయిందో లేదో ఈసీఐ పోర్టల్ (జశీవతీం.వఎఱ.స్త్రశీజ.ఱఅ) సందర్శించి, ఎపిక్ కార్డు లేదా మొబైల్ సంఖ్య, ఓటీపీతో సులభంగా తనిఖీ చేసుకోవచ్చు. నోటీసు వచ్చినట్లు తేలితే, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఈసీ నిర్దేశించిన 12 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఒకదానిని ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేయవచ్చు లేదా స్థానిక బీఎల్‌ఓ/ఈఆర్వోలకు రాతపూర్వకంగా అందజేయవచ్చు.



# సత్తా చాటిన మహిళా రెజ్లర్లు.. మాన్సికి రజతం

న్యూఢిల్లీ : అండర్-20 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్షిప్లో భారత మహిళా రెజ్లర్లు మూడు పతకాలతో మెరిశారు. 68 కిలోల విభాగం ఫైనల్లో చైనాకు చెందిన చెంగ్లింగ్ సాంగ్ చేతిలో ఓడిన మాన్సి లాథర్ రజతంతో సరిపెట్టుకుంది. ఇక కాంస్య పతక పోరులో తన్వి మగ్దుమ్ (57 కేజీలు), కోమల్ (59 కేజీలు) ప్రత్యర్థులపై ఘనవిజయ సాధించి పతకాలను కైవసం చేసుకున్నారు.



# ఢిల్లీలో విజృంభిస్తున్న స్వైన్ ఫ్లూ

న్యూఢిల్లీ : ఢిల్లీలో స్వైన్ ఫ్లూ (హెచ్1ఎన్1) కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 1,777కి పైగా కేసులు నమోదైనట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని, తుమ్మేటప్పుడు, దగ్గేటప్పుడు నోరు, ముక్కును కవర్ చేసుకోవాలని సూచిస్తున్నారు. అనవసరంగా కళ్లు, ముక్కు, నోటిని తాకవద్దని, తరచూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని ఆరోగ్యశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది.



తెలుగు దినపత్రిక
# దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

ఆగస్టు | సోమవారం | 24 | 2026



# సామూహిక బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే.





**(యాదాద్రి కరెస్పాండెంట్ ):(దేశ టైమ్స్ )ఆగస్టు 23.**

బోనాల ఉత్సవాల సందర్భంగా భువనగిరి పట్టణంలో అర్బన్ కాలనీ, హనుమాన్ వాడలో, వలిగొండ పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన సామూహిక బోనాల మహోత్సవంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మికత, సాంస్కృతిక విలువలను మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆవెస్ చిస్తి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్, వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, మండల అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, వలిగొండ పట్టణ అధ్యక్షు లు జానకి రాములు, నాయకులు ప్రజాప్రతినిధులు భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ శాఖలో కొత్త నిబంధనలకు పాతర – సుప్రీంకోర్టు తీర్పులను కూడా బేకార్ చేస్తున్న వైనం.

**దేశ టైమ్స్ నల్గొండ ప్రతినిధి:**

మిషన్ భగీరథ శాఖలో కొనసాగుతున్న పదోన్నతుల రగడ,

ఎన్నో పోస్టులు ఖాళీ ఉన్న చోద్యం చూస్తున్న శాకాధిపతి.

సీనియర్లను కాదని జూనియర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని ముందుకు కదులుతున్న ఫైల్లు.

గతంలో ఇంజనీరింగ్ శాఖలో ప్రమోషన్ల విషయంలో నిబంధనలను ఏ మార్చి పొరపాట్లు జరగడం సర్వసాధారణంగా జరిగేది. అందులో భాగంగా అనావరులకు పైన ప్రమోషన్లు ఇచ్చి, సీనియర్లకు అన్యాయం జరిగేది. ముందు రిక్రూట్ అయిన సీనియర్ ఇంజనీర్లు (AEE, గ్రాడ్యుయేట్ ఇంజనీర్లు ) డిప్లమా నాన్ – గ్రాడ్యుయేట్ ఇంజనీర్ల క్రింద పాత నిబంధనలో ఉన్న 3:1 (3AEE : 1AE) ప్రమోషన్ ఛానల్ నేపంతో పదోన్నతులు ఇవ్వడం ద్వారా సీనియర్లు జూనియర్ల కింద పనిచేసే దుస్థితి ఉండేది, గతంలో APPSC / TGPSC మెరిట్ పరిగణనలోకి తీసుకోకుండా కల్పించడం ద్వారా ౹ూజ( పబ్లిక్ సర్వీస్ కమిషన్) మెరిట్నకు గుర్తింపు లేకుండా పోయేది మరియు గతంలో ఇజుజు పోస్టు జోనల్ క్యాడర్ పోస్టుగా ఉండేది. లోకల్, జోనల్ మరియు రాష్ట్రస్థాయి క్యాడర్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఇజుజు పోస్టు రాష్ట్ర స్థాయి కేడర్గా పరిణితి చెందింది. ఇటువంటి గందరగోళంను ముగింపు పలకాలనే సదుద్దేశంతో ప్రభుత్వం అన్ని ఇంజనీరింగ్ శాఖలకు ఒకే విధమైన సర్వీస్ నిబంధనలను రాష్ట్రపతి ఆమోదంతో జీవోలు గెజిట్ రూపంలో ఇవ్వడం జరిగింది. ఇదే క్రమంలో మిషన్ భగీరథ శాఖలో కూడా G. O Ms. No. 32 & 33 లను తేదీ 08/09/2022 న ఇవ్వడం జరిగింది. అలాగే రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా శాఖలో పోస్టుల స్థాయిలను పునర్వ్యవస్థీకరణ చేయడం జరిగింది.అందులో భాగంగా ఇజుజు స్థాయి నుండి ENC వరకు రాష్ట్రస్థాయి క్యాడర్గా మార్చడం జరిగింది. ఇట్టి నిబంధనలను అమలు పరుస్తూ అన్ని౹ూజ మరియు Non PSC బ్యాచ్ ఇంజనీర్ల సీనియార్టీ రీసైజ్ చేయడం జరిగింది. ఇదే సీనియార్టీని ఆధారంగా చేసుకొని 1997 AEE PSC బ్యాచ్ ఇంజనీర్లకు EE నుండి SE గ పదోన్నతులు ఇటీవల ప్రభుత్వం కల్పించడం జరిగింది. అదేవిధంగా 2013 AEE PSC బ్యాచ్కు సంబంధించిన ఇంజనీర్లను కూడా DEE గా పదోన్నతులు ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం సుమారుగా మిషన్ భగీరథ శాఖలో Chirf Engineer (CE) పోస్టులు – 4, Superindent Engineer (SE) పోస్టులు – 3, Executive Engineer (EE) పోస్టులు – 46, ఃeputy Eeecuty Engineer (DEE) పోస్టులు – 15, ఖాళీగా ఉన్నవి. అలాగే పైన తెలిపిన ఖాళీలు పదోన్నతుల ద్వారా భర్తీ చేయడం వలన 53 ఇజుజు పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉన్నది. కానీ అర్హులైన 2016 PSC AEE బ్యాచ్ ఇంజనీరింగ్ ఉన్నప్పటికీ వారి సీనియార్టీ జాబితాను సిద్ధం చేయకుండా పదోన్నతులలో తీవ్రమైన తాత్పర్యం జరుగుతుంది. అలానే శాఖలో సాంకేతికపరమైన నిర్ణయాలు తీసుకునే అతి ముఖ్యమైన చీఫ్ ఇంజనీర్ స్థాయి పోస్టులు కొన్ని FAC లతో నడుపుతూ, రెగ్యులర్ పోస్టులు ఖాళీగా ఉన్న, తన ఎక్స్టెన్షన్ ఉనికిని దృష్టిలో పెట్టుకొని క్యాడర్ స్ట్రెంత్ చేయకుండా చీఫ్ ఇంజనీర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయకుండా ENC జాప్యం చేస్తున్నారు . ఇట్టి ప్రక్రియ ద్వారా మొత్తం సుమారు 121 పోస్టులకు పదోన్నతులు కల్పించే అవకాశం ఉన్నది. మిషన్ భగీరథ శాఖలో ప్రస్తుతం 2010 AEE PSC బ్యాచ్ నకు ఇజుజు నుండి జుజు ప్రమోషన్ ఇవ్వాల్సి ఉన్నది. వీరికి కూడా అందరి మాదిరిగానే కొత్త సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా సీనియార్టీ జాబితాలు సిద్ధం చేయడం జరిగింది. సీనియార్టీ పై ఉన్న కోర్టు కేసుల్లో కూడా కొత్త సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా కోర్టు జడ్జిమెంట్ రావడం జరిగింది. ఇటీవల సుప్రీంకోర్టు వారు సర్వీస్ నిబంధనలకు సంబంధించిన సివిల్ అప్పీల్ నెంబర్ 9041/2019, తేదీ: 27-05-2026 నాడు జడ్జిమెంట్ లో ఉద్యోగాలు ఖాళీ ఏర్పడినప్పుడు అమలులో ఉండి. ఆ తరువాత రద్దయిన నిబంధన ప్రాతిపదికన తమకు పదోన్నతులు కల్పించాలని కోరే హక్కు ప్రభుత్వ ఉద్యోగికి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పదోన్నతుల ప్రక్రియ చేపట్టిన నాటికి అమల్లో ఉన్న నిబంధనలకు మాత్రమే వారిని పరిగణలోకి తీసుకోవాలని పేర్కొంది. ముఖ్యంగా క్యాడర్ మార్పు, ఉద్యోగాల పునర్వ్యవస్థీకరణ విషయాలకు ఇది వర్తిస్తుందని జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ఎస్. వి.ఎన్ బట్ ల ధర్మాసనం ఉట్టూకించింది. ఇది ఇలా ఉండగా, కొత్త నిబంధన ప్రకారం సీనియార్టీని పక్కదో పట్టిస్తూ అమలులో లేని గత నిబంధనల ప్రకారం సీనియార్టీ జాబితాను తయారుచేసి, అరువులు కానీ వారికి పదోన్నతులు కల్పించాలని ఉద్దేశంతో మిషన్ భగీరథ శాఖలో గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఇందులో పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారుతున్నాయని ఉద్యోగ వర్గాల్లో తీవ్రమైన అసంతృప్తి కలుగుతున్నది. మిగతా అన్ని ఇంజనీరింగ్ శాఖలలో కొత్త నిబంధన ప్రకారం పదోన్నతులు ప్రభుత్వం కల్పిస్తున్నప్పటికీ మిషన్ భగీరథ శాఖలో మాత్రం పదోన్నతులు కనుమరుగయ్యాయి. ఇప్పటికైనా శాకాధిపతులు మరియు సంబంధిత మంత్రివర్యులు కలగజేసుకొని ప్రభుత్వం జారీ చేసిన నియమ నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించి. డిపార్ట్మెంట్లో ఉన్న అన్ని ఖాళీలను భర్తీ చేస్తూ ఇంజనీర్లలో నెలకొన్న అనుమానాలను పూర్తిస్థాయిలో తొలగించి పదోన్నతులు కల్పించే విధంగా ూణ ని ఆదేశించాలని ఇంజనీర్ల భావన. మిషన్ భగీరథ శాఖలో నెలకొన్న తీవ్ర గందరగోళ పరిస్థితి ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవడం ద్వారా ఉద్యోగస్తులలో ఉపశమనం లభించే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

# శస్త్రచికిత్సకు ఆది శ్రీనివాస్ చేయూత.. రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు

**రుద్రంగి ఆగస్టు23(దేశ టైమ్స్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఎర్రం శ్రీనివాస్ శస్త్రచికిత్స కోసం రూ. 2.50 లక్షల ఎల్ఓసీని కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంజూరు చేయగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రం గంగనర్సయ్య అందజేశారు. శస్త్రచికిత్స కోసం ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ను కలిసిన ఎర్రం శ్రీనివాస్ తనకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన ఆది శ్రీనివాస్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం రూ. 2.50 లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్కు ఎర్రం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండి నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కేశిరెడ్డి నర్సారెడ్డి కొమిరే శంకర్, తర్రె లింగం, పల్లి గంగాధర్,దయ్యాల శ్రీనివాస్,కట్కూరి దాసు,దేశవేని భూమేష్,గంధం మనోజ్,ఆక్కనపెల్లి శ్రీనివాస్,తుమ్మనపల్లి రామకృష్ణ,దువ్వక గంగాధర్,తదితరులు పాల్గొన్నారు.....



# పంతంగి గ్రామ పరిధిలో శనిగల గుట్ట వద్ద దారుణ హత్య.

**(యాదాద్రి కరెస్పాండెంట్ )దేశ టైమ్స్, ఆగస్టు 23.**



చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామ పరిధిలోని శనిగల గుట్ట వద్ద దారుణ హత్య చోటుచేసుకుంది. అంకిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన దానయ్య (30) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# సంస్కృతి సాంప్రదాయలకు ప్రతీక బోనాలు

**వలిగొండ, ఆగస్టు 23 (దేశ టైమ్స్)**



సంస్కృతి సాంప్రదాయలకు ప్రతీక బోనాల పండుగ అని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఊర బోనాల సందర్భంగా ఆయన పాల్గొని, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనం ఎత్తుకొని డప్పు చెప్పులతో, డోలు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు బోనాలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గరిసె రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్, మత్స్యగిరి గుట్ట చైర్మన్ తుమ్మల శ్రీనివాస్, ఉపసర్పంచ్ మల్గ మాధవి, చిట్టెడి జనార్దన్ రెడ్డి, పాశం సత్తిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బత్తిని సహదేవ్, పోలేపాక జానకి రాములు, సింగిల్ విండో వైస్ చైర్మన్ జక్క జంగారెడ్డి, పబ్బు సురేందర్, కాసుల వెంకన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల స్వంత ఇంటి కల నెరవేర్చిన ప్రభుత్వం

**వలిగొండ, ఆగస్టు 23 (దేశ టైమ్స్)**



పేద ప్రజలకు స్వంత ఇంటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సుర్వి పూలమ్మకు మంజూరు అయిన నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలలో ఏ ఒక్క పేదవానికి స్వంత ఇంటి కల నెరవేర్చలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకటపాపి రెడ్డి, మార్కెట్ ఛైర్మెన్ భీమా నాయక్, పిఏసిఎస్ చైర్మన్ గరిసే రవి, వైస్ చైర్మన్ జక్కా జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బత్తిని సహాదేవ్, పోలేపాక జానకిరాములు, కాసుల వెంకన్న, కొండూరు సాయి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీనారసింహస్వామి ఆలయంలో దేవుని పాదాల ప్రతిస్టపన

**రుద్రంగి ఆగస్టు23(దేశ టైమ్స్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలోని శ్రీ లక్ష్మీనారసింహ స్వామి ఆలయంలో దేవుని పాదాల ప్రతిస్టపన కార్యక్రమాన్నీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సామ మోహన్ రెడ్డి దంపతులు స్వామివారి పాదాలకు ప్రత్యేక పూజలు చేసి ప్రతిస్టపన కార్యక్రమన్నీ ప్రారంభించారు. ఆలయ చైర్మన్ మాట్లాడుతూ. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి భక్తుల షౌకర్యార్థం ఆలయంలో స్వామివారి పాదాలను ప్రతిష్టించమని అన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని పాదాల వద్ద ప్రత్యేక పూజలు చేసేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. అలాగే కొబ్బరికాయలు కొట్టే ప్రాంతాన్ని కూడా ఏర్పాటు చేశామని అన్నారు. భక్తులు స్వామి దర్శించుకొని కిందకి దిగడానికి మెట్ల మార్గం నుతనంగా నిర్మించినట్టు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో పార్క్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. తమ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుందని అన్నారు. ఇంకా ఎవరైనా భక్తులు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధి లో భాగస్వామ్యం కావాలని కోరారు. స్వామివారి పాదాలను అందజేసిన గుగ్గిళ్ల దేవయ్య – నందమ్మ దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్ ఆలయ కోశాధికారి ఈర్ణం నవీన్,సభ్యులు,గుగ్గిళ్ల తిరుపతి,పిట్టల జీవన్,రావణవేణి సందీప్ ,ఆకుల పెద్దన్న వెంకటి,గట్ల సాగర్,పిసరి శ్రీనివాస్,పరంకుశం అచ్చుత్,ఇప్ప మల్లేశం,నర్మద,గంగోత్రి, విజయ, నర్సయ్య,పాల్గొన్నారు



తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## ఇకపై ఓన్లీ బ్లాక్‌బస్టర్లే.. సినిమా నిర్మాణంపై బండ్ల గణేశ్ కీలక ప్రకటన!



ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేశ్ మరోసారి పూర్తిస్థాయిలో చిత్ర నిర్మాణంపై దృష్టి సారించాడు. ఇకపై తన ప్రయాణం కేవలం సినిమాలతోనే ఉంటుందని, బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించడమే తన ఏకైక లక్ష్యమని ఆయన స్పష్టం చేశాడు. మరే ఇతర అంశాలతోనూ తనకు సంబంధం లేదని పేర్కొంటూ శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికర సందేశాన్ని పోస్ట్ చేశాడు."ఇక నా దృష్టి, నా నిర్ణయం, నా ప్రయాణం అంతా సినిమా నిర్మాణంపైనే. ప్రస్తుతం నాకు మరే ఇతర విషయాలతోనూ సంబంధం లేదు. కేవలం బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించాలనే గట్టి సంకల్పంతోనే ముందుకు సాగుతున్నాను. నా శ్రమ, సమయం, శక్తి అంతా ఇక సినిమాకే అంకితం" అని బండ్ల గణేశ్ తన పోస్టులో వెల్లడించాడు. మంచి సినిమాలు నిర్మించి, అఖండ విజయాలను అందుకోవడమే తన తదుపరి లక్ష్యమని ఆయన నొక్కిచెప్పాడు. గతంలో బండ్ల గణేశ్ తన 'పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై పవన్ కల్యాణ్‌తో 'గబ్బర్ సింగ్', ఎన్టీఆర్‌తో 'బాద్‌షా', 'టెంపర్' వంటి భారీ విజయాలను అందుకున్నాడు. కొంతకాలంగా రాజకీయ పరమైన వ్యాఖ్యలతో నిరంతరం వార్తల్లో నిలుస్తున్న ఆయన, ఇటీవలే 'బీజీ బ్లాక్‌బస్టర్స్' (బండ్ల గణేష్ బ్లాక్‌బస్టర్స్) పేరుతో నూతన నిర్మాణ సంస్థను ప్రారంభించాడు.

## రూమర్స్‌పై గోవిందా సీరియస్.. రూ.100 కోట్ల దావా హెచ్చరిక!

బాలీవుడ్ నటుడు, మాజీ ఎంపీ గోవిందా తన వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించాడు. తన పెళ్లికి సంబంధించి తప్పుడు, నిరాధారమైన సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిస్తూ పబ్లిక్ నోటీసు జారీ చేశాడు. సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, మీడియా సంస్థలు, కంటెంట్ క్రియేటర్లు ఎవరైనా తన గురించి లేదా తన కుటుంబం గురించి కల్పిత, ధ్రువీకరించని సమాచారాన్ని ప్రచురించవద్దని ఈ నోటీసులో స్పష్టం చేశాడు.గోవిందా భార్య సునీతా అహుజా, నటి రాఖీ సావంత్‌తో జరిపిన సంభాషణ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయిన మరుసటి రోజే ఈ నోటీసు వెలువడటం గమనార్హం. నటి రాణి స్వర్ణకర్‌ను గోవిందా పెళ్లి చేసుకోవాలనుకోవడంతోనే తాను విడాకుల పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నానని ఆ సంభాషణలో సునీత చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే గోవిందా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నాడు.ఫొటోలు, వీడియోలు, మార్ఫింగ్ చిత్రాలు, డీప్‌ఫేక్‌లు, ఏఐ టెక్నాలజీతో తన అనుమతి లేకుండా వాయిస్, ఇమేజ్, గుర్తింపును వాడుకోవడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని నోటీసులో పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత 2023, ఐటీ చట్టం 2000 ప్రకారం సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు.దోషులుగా తేలిన వారి నుంచి రూ.100 కోట్ల వరకు నష్టపరిహారం క్లెయిమ్ చేయడంతో పాటు, వారి బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం, ఆస్తుల లావాదేవీలపై ఆంక్షలు, పాస్‌పోర్టుల జప్తు వంటి చర్యల కోసం కూడా కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించాడు. తన పబ్లిక్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు వ్యవస్థీకృతంగా పుకార్లు వ్యాపింపజేస్తున్నారని గోవిందా ఆందోళన వ్యక్తం చేశాడు.



## ప్రశాంత్ వర్మ 'మహాకాళి' నుంచి రేపు అక్షయ్ ఖన్నా 'యుద్ధరావం'

బ్లాక్‌బస్టర్ చిత్రం 'హనుమాన్'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, తన సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయూ) నుంచి మరో భారీ చిత్రాన్ని ప్రకటించడం తెలిసిందే. 'మహాకాళి' అనే శక్తివంతమైన టైటిల్‌తో రాబోతున్న ఈ లేడీ సూపర్ హీరో చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా రాక్షస గురువు శుక్రాచార్యుడి పాత్ర పోషిస్తున్నారు. 'శుక్రాచార్యుడి యుద్ధరావం' పేరిట దీనికి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను రేపు (ఆగస్టు 24) ఉదయం 11:34 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది.'హనుమాన్' చిత్రంతో ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌కు అద్భుతమైన పునాది పడింది. ఇప్పుడు అదే యూనివర్స్‌లో భాగంగా వస్తున్న ఈ 'మహాకాళి' చిత్రంపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. "మీరు ఇప్పటివరకు వినని సరికొత్త ప్రపంచాన్ని చూసేందుకు సిద్ధంగా ఉండండి" అంటూ చిత్ర బృందం ఇచ్చిన క్యాప్షన్, సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలో కన్నడ భామ భూమి శెట్టి లీడ్ రోల్ పోషిస్తోంది. పూజా అపర్ణ కొల్లూరు 'మహాకాళి' చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ దుగ్గల్ ఆర్‌కేడీ స్టూడియోస్, ఎస్ఓఆర్‌కేడీ స్టూడియోస్ పతాకాలపై నిర్మిస్తున్నారు.ఈ సినిమా తారాగణం చూస్తే దీని స్థాయి ఏంటో స్పష్టమవుతోంది. అక్షయ్ ఖన్నాతో పాటు శ్రియారెడ్డి, సముద్రఖని, నాజర్, రోహిత్ సురేష్ సరాఫ్, మురళీ శర్మ, రజత్ కపూర్, జితిన్ గులాటి వంటి వివిధ పరిశ్రమలకు చెందిన ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ భారీ తారాగణం సినిమాను పాన్ ఇండియా స్థాయిలో మరో మెట్టు ఎక్కించనుంది.సాంకేతికంగా కూడా ఈ చిత్రాన్ని ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ సినిమాను ఐమ్యాక్స్ 3డీ, డాల్బీ సినిమా వంటి అధునాతన ఫార్మాట్లలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రానికి డిజిటల్ భాగస్వామిగా వ్యవహరిస్తోంది. సురేష్ రగుతు సినిమాటోగ్రఫీ, శ్రీనాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్షన్ అందిస్తున్నారు. 'హనుమాన్' తర్వాత పీవీసీయూ నుంచి వస్తున్న ఈ 'మహాకాళి' రౌద్రం ఎలా ఉండబోతుందోనని సినీ ప్రియులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.






## 13 ఏళ్ల కెరీర్ పై రాశీ ఖన్నా ఏమన్నారంటే...!

ప్రముఖ నటి రాశీ ఖన్నా భారత చిత్ర పరిశ్రమలో తన 13 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. 2013లో 'మద్రాస్ కేఫ్' చిత్రంతో నటిగా అరంగేట్రం చేసిన ఆమె, అప్పటి నుంచి సమయం చాలా వేగంగా గడిచిపోయిందని అన్నారు. పనిని ఎల్లప్పుడూ ఒక అదృష్టంగా భావించడం వల్లే తనకు అలా అనిపించిందని పేర్కొన్నారు. ఇటీవల '120 బహదూర్' చిత్రంలో ప్రత్యేక పాత్రలో కనిపించిన రాశీ, తన కెరీర్‌ను గుర్తుచేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ ప్రయాణం గురించి రాశీ ఖన్నా మాట్లాడుతూ, "పదమూడేళ్లు సుదీర్ఘ సమయం. కానీ, పనిని ఎప్పుడూ ఒక అదృష్టంగానే భావించాను కాబట్టి సమయం తెలియలేదు. 'మద్రాస్ కేఫ్' రోజుల్ని గుర్తుచేసుకుంటే, నా ప్రయాణం ఎందుకు మొదలైందో తెలుస్తుంది. నేను చెప్పాలనుకున్న కథలకు ఆ సినిమా అవకాశం ఇచ్చింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అని తెలిపారు. 'మద్రాస్ కేఫ్' తర్వాత ఆమె కెరీర్ వేగం పుంజుకుంది.తొలి సినిమా నుంచే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాశీ ఖన్నా, హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో విజయవంతంగా రాణిస్తున్నారు. విభిన్న భాషల్లో నటించడం కేవలం యాదృచ్ఛికం కాదని, స్పష్టమైన ప్రణాళికతోనే బహుభాషా నటిగా పాన్-ఇండియా స్థాయిలో గుర్తింపు పొందారని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం రాశీ ఖన్నా పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫర్జీ' వెబ్ సిరీస్ రెండవ సీజన్‌లో ఆమె నటిస్తున్నారు. షాహిద్ కపూర్, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో ఆమె ఆర్‌బీఐ అధికారిణి మేఘా వ్యాస్ పాత్రను మరోసారి పోషించనున్నారు. దీనితో పాటు, సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా రాబోతున్న తమిళ యాక్షన్ థ్రిల్లర్ 'ధర్మన్'లోనూ, బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ హీరోగా అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్న కామెడీ డ్రామాలోనూ ఆమె హీరోయిన్‌గా కనిపించనున్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280